క్లుప్తంగా

వడలి ఉపాధ్యాయుడికి రాష్ట్ర స్థాయి అవార్డు


లక్ష్మీ నరసింహ మూర్తి

పెనుగొండ: మండలంలోని వడలి గ్రామం జెడ్పీహెచ్ఎస్ హైస్కూలు నంబర్-5 మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న బచ్చు లక్ష్మి నరసింహ మూర్తి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గతంలో దేవ, కొడమంచిలి, అయినపర్రు గ్రామాల్లో లెక్కల టీచర్ గా పని చేసినట్లు తెలిపారు. అవార్డు రావడం పట్ల సంతోషంగా ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మద్యం సీసాల స్వాధీనం


బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తితో ఎక్సైజ్ సిబ్బంది

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతంలో అక్రమంగా బెల్ట్ నిర్వహిస్తున్న జీ వెంకటేశ్వరరావు(58)ను అదుపులోకి తీసుకుని 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. శనివారం పెనుగొండ మండలంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సైలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ధరలు అదుపు చేయడంలో విఫలం


ఆచంటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ విమర్శించారు. శనివారం ఆచంట మార్కెట్‌లోని సీపీఎం స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఇరు ప్రభుత్వాలు స్పందించి నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ శర్మ, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లాబ్బాయి, బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, మన్నే బ్రహ్మయ్య, షేక్ ఖాసిం, నాగరాజు, మోహనరావు తదిరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వేములదీవి వెంకన్న


పాండురంగని అలంకరణలో కాపులకొడప వేంకటేశ్వర స్వామి

నరసాపురం రూరల్: కార్తీకమాసం శనివారం పురస్కరించుకుని మండలంలోని వేములదీవి కాపులకొడప గ్రామంలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ని పాండురంగడు, మహాభక్తురాలు జానాభాయిలుగా అలంకరించారు. వారం, వారం స్వామి వారిని వివిధ రూపాల్లో అలంకరించడం ఈ ఆలయ ప్రత్యేకతగా నిలుస్తోంది. స్వామి వారి ఆలయంలో ప్రతి వారం భక్తులు రద్దీ పెరుగుతోంది. కార్తీకమాసం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సబ్‌స్టేషన్ వద్దే బాధితులు

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని ఆక్రమణ బాధితులు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సబ్ స్టేషన్ వద్దే పడుగాపులు కాసి, నిరసన వ్యక్తంచేశారు. తమ ఇళ్లకు కరెంట్ కట్ చేయడం దారుణమని, ఇళ్లు ఖాళీ చేసేందుకు వారం రోజులు గడువు ఇచ్చి కరెంటు తీసివేయడంలో ఆంతర్యమేంటని వారు విద్యుత్ శాఖ అధికారులను నిలదీస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకూ కార్యాలంలో పడుకున్న బాధితులు శనివారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకూ సబ్ స్టేషన్ వద్దే బైఠాయించారు. విద్యుత్ అధికారులు ఎవరూ కార్యాలయానికి రాకపోవడంతో వారు తిరిగి వెళ్లిపోయారు. బాధితులకు అండగా సీపీఎం నాయకులు బీవీ వర్మ, సందక సూరిబాబు, తవిటినాయుడు, బీ.రాంబాబు, డి.రవితేజ తదితరులున్నారు.

మద్యం అక్రమ తరలింపుపై కేసు నమోదు

భీమవరం (ప్రకాశంచౌక్):ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. వీరవాసరం నుంచి నవుడూరు వైపు ఆటోలో 816 మద్యం సీసాలు తరలిస్తుండగా పంజావేమవరం వద్ద జరిపిన సోదాల్లో పట్టుబడ్డాయన్నారు. ఈ కేసులో పి.వెంకన్న, కె.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు.

రంగుల జీవితంలో ప్రమాదంతో సావాసం

- దుర్భరంగా పెయింటర్స్ జీవితాలు
- ప్రమాదకరంగా వృత్తి నిర్వహణ
- 50 ఏళ్లు దాటిన పెయింటర్‌కు పెన్షన్ అందించాలని డిమాండ్


పాలకొల్లు సెంట్రల్: కోట్లాది రూపాయలు పెట్టి భవనం కట్టుకున్నా చివరకు ఆ రంగులు పడితేనే ఆ భవనంలో జీవం కనిపిస్తుంది. కొత్త, పాత ఏ భవనానికైనా సరే ఆ రంగులు పడితేనే అందం, ఆకర్షణ కనిపిస్తుంది. భవనం లోపల ఎన్ని హంగులతో కట్టుకున్నా ఆకర్షణీయంగా కనిపించాలంటే ఆ రంగులే ఆ భవనాల అందాన్ని మరింత పెంచుతాయి. పెయింటర్ ఎండనక, వాననక ఎంత కష్టపడి తమ శ్రమను దారబోశాడో రంగులు పూర్తయిన తరువాత నలుగురు వచ్చి భవనం బాగుంది అంటేనే ఆ కార్మికుల శ్రమకు ఓ సార్థకత ఉంటుంది. భవనానికి పెయింట్ వేయాలంటే ఆ కార్మికుడు దాదాపుగా 70 శాతం రంగులను గాల్లో నుంచే వేయాల్సిన ప్రమాదకరమైన పరిస్థితి. ఒక భవనానికి పెయింట్ వేయాలంటే ఎన్ని వనరులు అమర్చుకున్నా కొన్ని చోట్ల మాత్రం ప్రమాదకరమైన పరిస్థితుల్లోనే పెయింట్ వేయాల్సిన దుస్థితి ఆ కార్మికులది.

ఎత్తయిన భవనాలు, అపార్ట్‌మెంట్లు....

ఎత్తయిన భవనాలు, అపార్ట్‌మెంట్లలో రంగులు వేసే సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వారి జీవనవిధానం కొనసాగిస్తుంటారు. కొన్ని చోట్ల అరప కట్టుకుని పెయింటింగ్ వేస్తుంటారు. కొన్ని ప్రదేశాల్లో తాడుతో బల్ల కట్టు కట్టుకుని ఇద్దరు వ్యక్తులు భవనంపై నుండి పట్టుకుంటే ఆ బల్లపై కూర్చుని ఓ కార్మికుడు పెయింటింగ్ వేస్తుంటాడు. ఆ సమయంలో ఆదమరుపుగా ఉంటే మాత్రం ఆ కార్మికుడి ప్రాణం గాల్లో కలిసిపోయినట్లే. అలాగే లోపల భాగంలో ఎత్తయిన ప్రదేశాల్లో పెయింట్ వేసే సమయంలో నిచ్చెనలను వాడుతుంటారు. ఒక నుచ్చెనకు మరొక నిచ్చెన కట్టుకుని అత్యంత ప్రమాదకరంగా పెయింట్ వేస్తుంటారు. అయినా తన జీవన విధానంలో ఇటువంటి ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా సరే తన పని మాత్రం మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో భగవంతునిపై భారమేసి పనిచేసుకుంటూ వెళ్లడమే వారికి తెలిసిన మార్గం.


గాల్లో తాడు సాయంతో పెయింట్ వేస్తున్న కార్మికుడు


టిడ్కో గృహాల్లో ఎత్తయిన భవనంపై తాడుకు బల్ల కట్టుకుని పెయింట్ వేస్తున్న కార్మికుడు


వాటర్ పైప్‌కు నిచ్చెన వేసుకుని పెయింట్ వేస్తున్న కార్మికుడు

పెయింట్ కార్మికులకు ఆరోగ్య సమ్యస్యలు.....

నియోజకవర్గంలో సుమారు 2 వేలమంది వరకూ కార్మికులు ఉన్నారు. భవనాలకు పెయింట్ వేస్తున్నప్పుడు ప్రమాదం జరిగితే ప్రాణాలమీదకు రావడం లేదా అవయవలోపం వంటివి జరుగుతుంటాయి. ఉడ్ వర్క్‌కు పీయూ పాలిష్ వేసే సమయంలో, గోడలకు వాల్‌కేర్ వేసే సమయాల్లో పేపర్ కొట్టడం వంటివి చేస్తుంటారు. ఆ సమయాల్లో వచ్చే ఫౌడర్, వాసన ఊపిరితిత్తులకు పట్టేస్తుంది. ఆ ఊపిరితిత్తులపై పేపర్ పౌరకింద పట్టడంతో కొన్నాళ్లకు ఆ కార్మికుడి ప్రాణాల మీదకు వస్తుంది. అంతే కాకుండా కళ్ల సమస్యలు కూడా తలెత్తుతుంటాయి. గోడకు పేపర్ కొట్టే సమయంలో చేతులు కొట్టుకుపోతుంటాయి. ఇలా అనారోగ్య సమస్యలు అనేకం ఎదురవుతుంటాయి.

డైలీ లేదా కాంట్రాక్ట్....

భవనాలకు రంగులు వేసే సమంయంలో పనివారీలు డైలీ పనివారీ లేదా కాంట్రాక్ట్ గాను తీసుకుంటారు. రోజువారీ పని నిమిత్తం కార్మికునికి రూ. 700 నుండి 800 వరకూ జీతం ఉంటుంది. కాంట్రాక్ట్ పద్ధతిలో వాల్‌కేర్ పని విధానం అయితే మెటీరియల్‌తో కలిపి అడుగుకు రూ. 30 వరకూ తీసుకుంటారు. అదే క్వాలిటీ రంగులు కావాలంటే మరో రూ.5 వరకూ ఆదనంగా తీసుకుంటామని కాంట్రాక్ట్ పెయింటర్లు చెపుతున్నారు.

సొమ్ము చెల్లిస్తున్నా నో ఇన్సూరెన్స్



ప్రభుత్వం ఏర్పాటుచేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డుకు రూ. 110లు చెల్లించాము. దీనికి ప్రతీ సంవత్సరం రూ.12 చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలి. అలా ప్రతి సంవత్సరం చేయించుకుంటున్నాము. ఎవరికైనా ప్రమాదం జరిగినా ఇన్సూరెన్స్ మాత్రం రావడం లేదు. అవి అమలయ్యేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ప్రమాదాలకు గురైన మా కార్మికుల కుటుంబాలకు ఎంతో ఆసరాగా ఉంటుంది. 50 ఏళ్లు దాటిన పెయింటర్స్‌కు ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలి.

– నీలం రవి, ది ఆర్టిస్టు అండ్ పెయింటర్స్ అసోసియేషన్, అధ్యక్షుడు

ప్రభుత్వ సహకారం అవసరం



మా సంఘంలో సుమారు 700 మంది వరకూ సభ్యులు ఉన్నారు. సంఘంలో లేని సభ్యులతో కలిపి పాలకొల్లు పరిసరాల్లో సుమారు 2 వేల మంది వరకూ పెయింట్ కార్మికులు ఉన్నారు. సంఘం స్థాపించి సుమారు 40 ఏళ్లు కావస్తుంది. ఈ కాలంలో ప్రమాదానికి గురైన సుమారు 200 మంది కార్మిక కుటుంబాలకు మా సంఘం ఆర్థిక సహకారం అదిస్తూనే ఉంది. మా తోడ్పాటుకు ప్రభుత్వం సహకారం కూడా ఉంటే మంచిది.

– పి.వెంకటరమణారెడ్డి, పెయింటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

నేడు శైవ క్షేత్రాలకు బైక్ యాత్ర

పాలకొల్లు అర్బన్: స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శైవ క్షేత్రాలకు బైక్ యాత్ర నిర్వహిస్తామని సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 7.30గంటలకు పాలకొల్లు పట్టణంలోని శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభించి పూలపల్లి, వీరవాసరం, భీమవరం, యనమదుర్రు వరకు మోటార్‌సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఇసుక ర్యాంపును ఏర్పాటు చేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం పరిసర ప్రాంతాల వారి కోసం స్థానిక లాకులు సమీపంలో ఇసుక ర్యాంపును ఏర్పాటు చేయాలని కోరుతూ ఇరు సంఘాల వారు ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ దాసి రాజును కలిసి ట్రాక్టర్స్ యూనియన్, బోట్స్‌మెన్ సొసైటీ సంయుక్తంగా ఈ వినతిపత్రాన్ని అందజేశారు. దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, యలమంచిలి లంక, కట్టుకాలువ, జొన్నాడ, గోపాలపురం ర్యాంపుల నుంచి ఉచిత ఇసుకను ట్రాక్టర్లపై తెచ్చుకునేందుకు అనేక ఇబ్బంది పడుతున్నామని, అక్కడి స్థానికులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అందువల్ల స్థానికంగా ఇసుక ర్యాంపును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆధారపడి సుమారు 250 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మల్లాడి మూర్తి, గోవిందరాజులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లతో దీర్ఘకాలిక కేసుల పరిష్కారం

భీమవరం అర్బన్: పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి హోహాన్ (న్యూటన్) అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో డ్వాక్రా సంఘ భవనంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టం గురించి అవగాహన కల్పించారు. డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం కాని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కారం చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

వరి కోతలు ప్రారంభం


దగ్గులూరులో కోత మెషీన్ ద్వారా వరి కోస్తున్న దృశ్యం


దగ్గులూరులో కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్ సహాయంతో గట్టుకి చేరుస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని సార్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందస్తుగా నాట్లు వేసిన రకాలు స్వర్ణ, సంపత్ స్వర్ణ కోతకు వచ్చాయి. దీంతో రైతులు వరికోత యంత్రాల సహాయంతో కోత కోయించడానికి సన్నద్ధమవుతున్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల, తిల్లపూడి, దగ్గులూరు, బల్లిపాడు, వెంకటాపురం, అరట్లకట్ట, లంకలకోడేరు, వెలివెల గ్రామాల్లో కోతలను ప్రారంభించారు. వరికోత మెషీన్ గంటకి రూ.2600 తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 250 ఎకరాల్లో కోతలు పూర్తి చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు తమకు నచ్చిన రైస్‌మిల్లుకి ధాన్యం విక్రయించుకోవచ్చని ఏఓ కె.రాజశేఖర్ చెప్పారు.

పేదల పథకాలపై చంద్రబాబు నోరుమెదపరే?

ఉండి: అధికారం కోసం పేదలకు అది చేస్తాం ఇది చేస్తామని చెప్పి అధికారాన్ని పొందిన చంద్రబాబు ఎందుకు వాటిని అమలు చేయడం లేదని వాటిపై ఎందుకు నోరు మెదపడం లేదని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి అవుల శేఖర్, ఉపకార్యదర్శి ఆర్ వెంకట్రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఆవుల శేఖర్, ఆర్.వెంకట్రావు, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలు కట్టే పన్నులతో నడుస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వారి సంక్షేమం కోసం అసలు ఖర్చు పెట్టడం లేదన్నారు. పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని పెట్టిన చంద్రబాబు దానికి రేషన్‌కార్డు కావాలని ముడిపెట్టారన్నారు.కానీ అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్నా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ఉచిత గ్యాస్‌కు రేషన్ కార్డు కావాలంటే పేదలు ఎక్కడి నుండి తెస్తారని ప్రశ్నించారు. అలాగే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని చెప్పడంతో పేదలు నమ్మి ఓట్లు వేసారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా చేసిన వాగ్దానాలపై చంద్రబాబు ఎంతుకు నోరు మెదపడం లేదని వాటిని ఎప్పుడు అమలు చేస్తారో? చెప్పాలన్నారు.వాగ్దానాలు అమలు చేయాలంటూ ఈ నెల 18 నుంచి అన్ని గ్రామ సచివాలయ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కార్మిక సంఘం ఆందోళనలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్లు జయకృష్ణ, సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, ఉల్లికల నాగలక్ష్మీ, లంకా సీతమ్మ, తమ్మనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపోరు

పెనుగొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజా పోరును విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించి, పోస్టర్లు ఆవిష్కరించారు. ఇందన చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ట్రూఆప్ చార్జీలు పేరుతో ప్రజలపై వేసిన విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, మహిళలు, చిన్నపిల్లలు, మైనార్టీలు, దళితులపై అత్యాచారాలు అరికట్టాలన్నారు. జమిలీ ఎన్నికల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వంటి ప్రజావ్యతిరేక విధానాలకు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా నవంబరు 8న నుంచి 14 వరకూ మండలంలో ప్రజా పోరు పేరుతో ఇంటింటికీ ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.


గాంధీ బొమ్మల సెంటర్ వద్ద సీపీఎం పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజలను చైతన్యపరచి సమీకరించి 14న మండల కార్యాలయం వద్ద, 15న జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద మహాధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా, గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, సీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్, గుర్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

నరసాపురం రూరల్: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ అన్నారు. శనివారం నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల నుంచి హాజరైన కరాటే క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. వీటిలో గెలిచిన క్రీడాకారులను వచ్చే నెల 3 నుంచి 7వరకు జరిగే నేషనల్ కరాటే పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థులు క్రీడలపట్ల కూడా ఆసిక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించారు.


నేషనల్ కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో స్వర్ణాంధ్ర యాజమాన్యం

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపిచంద్, ఫిజికల్ డైరెక్టర్లు మూర్తి, పి.సత్యనారాయణరాజు, అఫీషియల్స్‌గా ఏకెఎఫ్ ఫెడరేషన్ వి.ప్రవీణ్, ఎస్.సుభాన్, కరాటే మాస్టర్ కన్నా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

పాలకొల్లు అర్బన్: సైన్స్‌పై ప్రతి విద్యార్థీ అవగాహన పెంచుకోవాలని హెచ్ఎం అడ్డాల నాని అన్నారు. యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ సైన్స్ డే ఫర్ పీస్ అండ్ డవలప్‌మెంట్ సందర్భంగా శనివారం ఎంఎంకేఎస్ మునిసిపల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో సైన్స్ మానవుడికి ఏ విధంగా ఉపయోగపడుతుందో? వివరించారు. సైన్స్ ఉపాధ్యక్షుడు పడాల పల్లపురాజు, యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి, క్లబ్ చైర్‌పర్సన్ మంగిన అరుణ, కార్యదర్శి దేవరపు కాంచనమాల, కోశాధికారి శిద్దిరెడ్డి శైలజారాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ అందజేత

యలమంచిలి: మండలంలోని దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం పాలకొల్లు రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి పాలకవర్గ సభ్యులు 165 లీటర్ల ఫ్రిడ్జ్ అందించారు. క్లబ్ అధ్యక్షుడు కాలనాధభట్ల సుధీర్ బాబు తన తల్లి కాలనాధభట్ల కమలాదేవి జ్ఞాపకార్థం ఈ ఫ్రిజ్ ను పీహెచ్‌సీ వైద్యాధికారి కె. చంద్రరేఖకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ చేగొండి సూర్య ప్రకాష్, కార్యదర్శి ఇనుకొండ శేషాద్రి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ వర్ధనపు సుభాష్ చంద్ర సర్ఫ్యాప్, డాక్టర్ లీనా సుప్రియ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్లకు ఫ్రిడ్జ్ అందిస్తున్న దృశ్యం

ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా ప్రభాకర్

పాలకొల్లు అర్బన్: మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహాజన సోషలిస్టు పార్టీ పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉల్లంపర్తి ప్రభాకర్ మాదిగను జిల్లా అధ్యక్షుడు పలివెల పైడియ్య నియమించారు. శనివారం పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ కమిటీని ప్రకటించారు. మహాజన సోషలిస్టు పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పసుపులేటి నందాబాబు, పట్టణ అధ్యక్షుడిగా ఖండవల్లి శేఖర్, యలమంచిలి మండల అధ్యక్షుడిగా తవిటిక కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా ఉండ్రాజవరపు ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడిగా ఈది గణిరాజులను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చినబాబు, యార్లగడ్డ రత్నరాజు, యువసేన జిల్లా మాజీ అధ్యక్షుడు పసుపులేటి రాజేష్‌ఖన్నా, తెన్నేటి రాజు తదితరులు కమిటీ సభ్యులను అభినందించారు.


ప్రభాకర్‌ను అభినందిస్తున్న దృశ్యం

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

ఉండి: ప్రతి ప్రభుత్వాసుపత్రిలోనూ సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అన్నారు.శనివారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఆయన పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తల్లీబిడ్డా క్షేమంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చిన రోజు నుండి ఆమెను, ఆమె గర్భంలో పెరుతున్న శిశువును జాగ్రత్తగా కాపాడాల్సిన భాధ్యత వైద్యాధికారులపైనా,సిబ్బందిపైనా ఉందని అన్నారు. ముఖ్యంగా గర్భిణుల్లో రక్తహీనత లేకుండా పరీక్షా సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పీఎంఎస్‌వై(ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభయాన్) కార్యక్రమం సంక్రమంగా అమలు జరిగేలా చూడాలని అన్నారు. గర్భిణులకు పీహెచ్‌సీల్లో అన్ని పరీక్షలు నిర్వహించి హైరిస్క్‌లో ఉండే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధనిలపాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయిచంద్ర, సీహెచ్ఓ కృష్ణకుమార్, హెచ్‌వీ థెరిసమ్మ తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ మహేశ్వరరావు